కర్నూలు | నంద్యాల
వార్త
22 నవంబర్ 2022 మంగళవారం పేజీలు 4

# అకౌంటెంటు జనరల్ అధికారుల వింత లీలలు

- జిల్లా ట్రెజరీ అధికారులు నిర్లక్ష్యం, సబ్‌ట్రెజరీ అధికారుల అలసత్వం
- 8నెలలుగా రిటైర్డు పెన్షనర్ల అవస్థలు ఎన్నో...ఎన్నెన్నో...

**నందా ్యల విద్య, నవంబరు 21, ప్రభాతవార్తః** 30 సంవత ్సరాల పాటు ప్రభుత్వ ఉద్యోగం చేసి పదవి వీరమణ చేసిన ఉద్యోగులు, ఉపా ధ్యాయులు,వివిధ శాఖ అధికారులు అకౌంటెం టు జనరల్ అధికారుల వింతలీలలతో, జిల్లా ట్రెజరీ అధికారుల నిర్లక్ష్యంతో, సబ్‌ట్రెజరీ అధికారుల అలసత్వంతో పెన్షనర్లు నానా అవస్థలు పడుతున్న పిఆర్సీ 2022కు సంబంధించి 31-12-2020కి ముందు పదవివీరమణ పొందిన వారు రివైజ్డ్ పిఆర్సీ ప్రపోజల్ ్స పంపి వాటిరాక కోసం 8 నెలలుగా ఎదురుచుసు ్తన్న సంఘటనలు జరుగుతున్నాయి. ఏజి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహారిస్తున్నారన్న అరోపణలు వినిపిస్తున్నాయి. రివైజ్డు పెన్షన్‌లో ఉద్యోగులకు రావాల్సి న మొత్తాలను తగ్గించి పంపించడం 6 నెలలుగా కార్యాలయ ఫోన్ రింగు అవుతున్నా ఏవరు ఎత్తకపోవడం, సమాధానాలు ఇవ్వకపోవడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. దాదాపుగా నంద్యాల, కర్నూలు, ఉమ్మడి జిల్లాల్లో రివైజ్డు పిఆర్సీ ప్రతిపాదనలు 2 వేల మంది పంపివున్నారు. వారికి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడం విశేషం. దీనికి తోడు ఏజి అధికారులు ఏ జిల్లాకు ఆ జిల్లాల్లో సబ్‌ట్రెజరీ అధికారుల కోడ్ నంబర్లు మార్చడం గందరగోళానికి దారితీసింది. ఏజి అఫీసు నుంచి ప్రతిపాదనల కాగితం జిల్లా ట్రెజరీలకు వచ్చినప్పటికి అక్కడ రెండు నెలలు కాలయాపన చేయుచున్నారు. మరి సిబ్బందిలేక పెన్షనర్లు ఇచ్చే పైసల కోసమా ఏ విషయం తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ప్రతివిషయం ట్రెజరీలో అన్‌లైన్‌లోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. జిల్లా ట్రెజరీ నుంచి సబ్‌ట్రెజరీలకు వచ్చిన తరువాత అక్కడ అసలు రంగం ప్రారంభం అవుతుంది. వచ్చిన కాగితాలను చూసి సిబ్బంది పైసలు ఇవ్వందే ప్రతిపాదనలు, బిల్లులు చేయడం లేదు.

2లో



"ఎమ్మిగనూరు పట్టణంలో మూడు సెంట్లు స్థలం దొరికితే సొంత ఇల్లు కట్టుకోవాలని బావించే వారే ఎక్కువ మంది ఉంటారు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేస్తూ కూడబెట్టుకున్న సోమ్ముతో సొంత మండలంలో ప్లాట్ కొనుక్కోవాలని ఆశపడేవారు ఎక్కువ మంది ఉంటున్నారు. ఈ పరిస్థితే ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వరంగా మారగా..కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. పచ్చని పంటపోలాలను నాశనం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతులకు కోట్ల కట్టలను ఆశ చూపుతూ వ్యవసాయ భూములను కొనుగోలు చేస్తున్నారు. కొంటే కొన్నారు గానీ వ్యవసాయ భూమిని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నందున నిబంధనల ప్రకారం దానిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. ఇందుకు గాను మార్కెట్ విలువపై ఐదు శాతం కన్వర్షన్ ఫీజును రెవిన్యూశాఖకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఎమ్మిగనూరు ప్రాంతంలోని రియల్టర్లు ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలిచ్చి కన్వర్షన్ ఫీజుకు ఎగనామం పెడుతూ రియల్ దందాను జోరుగా సాగిస్తున్న తీరుపై వార్త అందిస్తున్న ప్రత్యేక కథనం."

ఎమ్మిగనూరు ప్రభాతవార్త :

# రియల్.. దందా..!

• వివరాలు 2లో

- ప్లాట్లుగా మారుతున్న వ్యవసాయ భూములు
- ఎమ్మిగనూరులో భారీగా నూతన వెంచర్లు
- అనుమతులు తీసుకోకుండానే అమ్మకాలు
- కన్వర్షన్ లేకుండానే అన్ని అనుమతులు
- చర్యలకు అధికారులు వెనుకడుగు



# కార్తిక శోభతో కళకళాలాడిన శ్రీగిరిక్షేత్రం..!



**శ్రీశైలంప్రాజెక్టు, నవంబర్21, ప్రబాతవార్త :** కార్తిక మాసం ఓ పవిత్ర పర్వదినం పండుగ ఈ రోజుల్లో భక్తులు చాల వరకు వేకువజామునసే లేచి పుణ్య స్నానాలు అచరించి తాను నమ్మిన దైవంను మనసార తలంచుకుంటూ అన్ని మంచి జరగాలని కోరుకుంటూ కార్తిక దీపంను వెలిగించి భక్తిని చాటుకుంటారు. తమ కోర్కలు తీరాలని దైవ సంకల్పంతో పుణ్య క్షేత్రాలకు తరలివెళ్లి నది స్నానాలు అచరంచి తమ మ్రొక్కులను తీర్చుకుంటున్నారు. ఈ నేపథ్యాంలోనే కార్తిక చివరి సోమవారం కావడంతో శ్రీశైలం మహపుణ్యక్షేత్రంకు అధిక సంఖ్యాలో భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దితో దైవ దర్శనంకు వెళ్లే క్యూలైన్లన్ని నిండిపోయాయి. సాదరణ ఉచిత దర్శనంకు వేళ్లాలంటే భక్తులు గంటల తరబడి వేచిఉండి శ్రీస్వామిఅమ్మవార్ల ను దర్శించుకు నేందుకు సమయం పట్టింది. భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకోని ఏర్పాట్ల ప్రత్యేక శ్రద్ద కనబరచి ఎటువంటి ఇబ్బందులు తలేత్తకుండా సర్వం సన్నద్దం చేసారు. శ్రీగిరికి చేరుకున్న భక్తులకు దర్శన ఏర్పాట్లు, సిబ్బందికి ప్రత్యేక విధులు, క్యూలైన్లలో అల్పాహారం, కార్తిక దీపోత్స వం, అన్నప్రసాద వితరణ, భక్తుల రద్దికి అనుగుణంగా లడ్డూప్రసాదాల విక్రయాలు, వసతి సౌకర్యం, వాహనాల పార్కింగు ఏర్పాట్లు తదితర వంటివి ప్రత్యేక శ్రద్ద కనబరిచారు. క్షేత్రంకు నలు వైపుల ఓంకార నాధం మారు మ్రొగింది. భక్తి పారవశ్యం మిన్నటింది. అధ్యాత్మిక భావంతో భక్తులు మురిసిపోయారు. అశేష జనవాహిని అ పరమ దేవదేవుని దర్శనం కోరకు తహతహలాడారు. కాగా భక్తులను రంజింప చేసేందుకు దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసారు.





# భక్తజనసంధోహంతో మురిసిన లక్షదీపోత్సవం..!

**శ్రీశైలంప్రాజేక్టు, నవంబర్21, ప్రభాతవార్త :** శ్రీశైలక్షేత్రం భక్తజనసందోహంతో లక్షదీపోత్స వం మురిసింది. అశేష జనవాహిన నడుమ పుష్కరిణి నడుమ కార్తిక దీపాకాంతులను వెదజల్లింది. ఎక్కడ చూసిన ఓం నమ:శివయా హరహర మహదేవ శంభోశంకరా అనే నామం క్షేత్రం నలువైపుల మారు మ్రెగంది. మల్లన్న చెంతకు భక్తులు తండోపా తండాలుగా తరలివచ్చారు. ఎటువైపు చూసిన ఆ పరమ శివుడి దర్శనం కొసం భక్తులు తహతహలాడుతున్నారు. శ్రీశైలక్షేత్రంలో కార్తిక నాల్గువ సోమవారం సందర్భంగా పుష్కరిణి వద్ద దేవస్థానం లక్షదీపోత్స వం మరియు పుష్కరిణిహారతిని నిర్వహించడం జరిగింది. లోక కల్యాణం కొసం ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. కార్తికమాసంలో ప్రతి సోమవారం (మొత్తం 4 సోమవారాలు) ఈ కార్యక్రమాలు జరిపించబడుతాయి. లక్షదీపోత్స వ:- ఈ దీపోత్స వ కార్యక్రమంలో పుష్కరిణి ప్రాంగణమంతా కూడా దీపాలను ఏర్పాటు చేయడం జరిగింది. కార్తికమాసంలో దీపారాధనకు ఎంతో ప్రాముఖ్య ముంది. ఈ మాసంలో దీపారాధనే కాకుండా దీపదర్శనం కూడా ఎంతో పుణ్యదాయకమని పురాణాలు చెబుతున్నాయి. కార్తిక దీపదర్శన వలన జాతిబేదం లేకుండా మానవులందరికి, ఇంకా పక్షులు, కీటాకాలు, జలచరాలు మొదలైన వాటికి, ఇంకా వృక్షాలను కూడా పునర్జన్మ ఉండదని పురాణాలు చెబుతారు.

**పుష్కరిణి హారతి, ధశవిధ హరతులు:** కార్తి్క సోమవారం సందర్భంగా సాయంత్రం గం.7.00ల నుండి ముందుగా శ్రీస్వామిఅమ్మవార్లకు మరియు పుష్కరిణికి ధశవిధహరతులు శాస్రోక్తంగా ఇవ్వబడ్డాయి. కాగా ఈ కార్యక్రమానికి ముందుగా శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్స వమూర్తులను పుష్కరిణి వద్దకు వేంచేబు చేయించి విశేషంగా పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హరతులను ఇవ్వడం జరిగింది.

**దశహరతులు - దర్శనఫలం:**

1) **ఓంకారహరతి:** పరబ్రహ్మ స్వరూపమైన బీజాక్షరమే ఓంకారం. ఈ ఓంకారహరతిని దర్శించడం వలనద కష్టాలన్ని నివారించబడుతాయి. సకల శుభాలు కలుగుతాయి.

2) **నాగహరతి:** ఈ నాగహరతిని దర్శించడం వలన సర్పదోషాలు తొలగిపోతాయి. సంతానం కలుగుతుంది.

3) **త్రిశూలహరతి:** ఈ త్రిశూల హరితిని దర్శించడం వలన అపమృత్యువు అంటే అకాలమరణం తొలగిపోతుంది. గ్రహదోషాలు నివారించబడుతాయి.

4) **నందిహరతి:** ఈ నందిహరతిని దర్శించడం వలన భయం, దుఖ:ము ఉండవు. ఆనందం, ఉత్సా హం లబిస్తాయి.

5) **సింహహరతి:** ఈ సింహహరతిని దర్శించడం వలన శత్రుబాధలు తొలగుతాయి. మనోధైర్యం కలుగుతాయి.

6) **సూర్యహరతి:** ఈ సూర్యహరతిని దర్శించడం వలన ఆరోగ్యం చేకూరుతుంది. దీర్ఘాయుష్షు లబిసుంతుంది.

7) **చంద్రహరతి:** ఈ చంద్రహరతి దర్శించడం వలన మనశుద్ది కలిగి, ఈర్ష్య, అసూయ ద్వేషాలు తోలగిపోతాయి. మానసిక ప్రశాంతత లబిసు ్తంది.

8) **కుంభహరతి:** ఈ కుంభహరతిని దర్శించడం వలన కోరుకున్న కోరికలు నెరవేరుతాయి. సంపదలు కలుగుతాయి.

9) **నక్షత్రహరతి:** ఈ నక్షత్రహరతిని దరి ్శంచడం వలన జాతక దోషాలు తోలగిపోతాయి. చేపట్టిన పనులలో విజయం లబిస్తుంది.

10) **కర్పూరహరతి:** ఈ కర్పూర హరతిని దర్శించడం వలన పాపాలన్ని తోలగిపోతాయి. యజ్ఞఫలంతో పాటు అష్ట ఐశ్వర్యాలు సిద్దిస్తాయి.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య..



**అవుకు, నవంబర్21, ప్రభాతవార్త :** అవుకు పట్టణంలోని తెలుగుపేటకు చెందిన కొవ్వూరు పాండురంగ(45)అనే రైతు సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే అవుకు పట్టణంలో కొవ్వూరు పాండురంగ సుమారు 35ఎకరాలు పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేయగా సరైన దిగుబడి రాకపోవడంతో సుమారురూ.50లక్షల వరకు అప్పులు అయ్యాయని అందుకు పాండురంగ తనకున్న ఎకరా పొలాన్ని అమి ్మ రూ.29లక్షల అప్పు చెల్లించాడని ఇంకా మిగిలి ఉన్న అప్పుల బాధను తట్టుకోలేక సోమవారం తెల్లవారు జామున పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వా సుపత్రికి తరలించారు. అయితే పాండు రంగ అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. పాండురంగ భార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగదీశ్వరరెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ప్రజా ఫిర్యాదులను కాలపరిమితిలోగ పరిష్కరించాలి

- వ్యతిరేక వార్తలపై అధికారులు స్పందించాలి : జిల్లా కలెక్టరు



**నంద్యాల, నవంబరు 21, ప్రభాతవార్తః** ప్రజాసమస్య పరిష్కార వేదికలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి కాలపరిమితిలోగ పరిష్కరించాలని ఏ ఒక్క స్పందన దరఖాస్తు బియాండ్ ఎస్ఎల్‌లోకి వెళ్లకూడదని జిల్లా అధికారులను జిల్లా కలెక్టరు డా.మనజిర్ జిలాని సామూన్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైయస్ఆర్ సెంటనరీ హాల్‌లో ప్రజాస్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న 92 రీ ఓపెన్ దరఖాస్తులు విత్ఇన్ ఎస్ఎల్‌లో 1057 దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఎలో 6 దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న 188 ఏపీసేవాల సర్వీసులను త్వరగా క్లియర్ చేయాలని అదేశించారు. క్షేత్రస్థా యి పోటోలను కూడ స్పందన పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు. అన్ని శాఖల్లో కోర్టుకు సంబంధించిన కంటెమ్ట్ కేసులకు కౌంటర్ ఫైల్ చేయడంతో పాటు మధ్యంతర, తుది ఉత్తర్వులను వెంటనే అమలుచేయాలని కలెక్టరు అదేశించారు. వార్త పత్రికల్లో ప్రతిరోజు వచ్చే వ్యతిరేకవార్తలపై వెంటనే స్పందించి ఏరోజుకారోజు యాక్షన్‌టెకెన్ రిపోర్టులతో పాటు రీజాయిండర్లు పంపాలని సంబంధిత అధికారులను కలెక్టరు అదేశించారు. ప్రజాసమస్యల్లో కొన్ని వినతులు డోన్ మండలం చిన్నమల్కాపురం నివాసి చెన్నయ్య తనకు 272/ఇ2లో 0.4 సెంట్ల భూమి ఉందని ఇదే సర్వేనంబరులో మరో వ్యక్తి నా నాలుగు సెంట్ల భూమి కలుపుకొని రిజిష్టర్ చేయించుకున్నారని న్యాయం చేయాలన్నారు. ఉయ్యాలవాడ మండలం అల్లూరు నివాసి అరుంధతి తన పుట్టుకతో మూగ, చెవుడు, వివకలాంగురాలినని తనకు సదరం సర్టిఫికెట్ ద్వారా అర్థికసాయం చేయాలని కోరారు. మహానంది మండలం గాజులపల్లె నివాసి గూడుపొగుల చిన్నపుల్లయ్య తాను వృద్దుడనని తనకు వృద్యాప్య ఫించను మంజూరు చేయాలని కోరారు. గోస్పాడుమండలం కానాలపల్లె నివాసి మద్దమ్మ తన భర్త కరోనా వృధితో రెండు సంవత ్సరాల క్రితం చనిపోయారని తనకు ఇంత వరకు అర్థికసాయం అందలేని న్యాయం చేయాలని కోరారు. జిల్లా నలుమూలల నుంచి స్పందన కార్యక్రమానికి వచ్చిన 124 మంది అర్జీదారులు తమ సమస్యలపై కలెక్టరుకు దరఖాస్తులు సమర్పించారు. సమావేశంలో డిఆర్వో పుల్లయ్యతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సచివాలయాల మీద పర్యవేక్షణ పెరగాలి - జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు



**కర్నూలు, నవంబర్ 21, ప్రభాతవార్త :** సచివాలయాల ద్వారా ప్రజలకు తక్కువ సేవలు అందుతున్నాయి.. .మరింత ఎక్కువగా సేవలందించేలా సచివాలయాల మీద పర్యవేక్షణ పెరగాలని జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలకు సంబంధించిన వినతులను కలెక్టర్ స్వీకరించారు.. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ రామ సుందర్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అర్జీల స్వీకరణ అనంతరం కలెక్టర్ స్పందన అర్జీల పరిష్కారం, ఇతర అంశాలపై జిల్లా అధికారులతో నేరుగాను, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సేవలందించాలని సచివాలయాల్లో ఉన్నత చదువులు చదివిన పిల్లలను ప్రభుత్వం నియమించింది... వీరంతా సక్రమంగా పని చేసేలా సంబంధిత జిల్లా అధికారులతో పాటు సబ్ కలెక్టర్, ఆర్డీవోలు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. సచివాలయంలో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించేలా ఎంపిడిఓ లు శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు రీ ఓపన్ అయిన దరఖాస్తులను స్వయంగా పరిశీలించాలి. స్పందన సమస్యలు 11 రీ ఓపన్ అయ్యాయని, పంచాయతీ రాజ్ నుండి 4, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ నుండి 2, వ్యవసాయ శాఖ, మున్సి పల్ పరిపాలన, పోలీస్, పాఠశాల విద్య, పౌరసరఫరాల శాఖల నుండి ఒక్కొక్కటి రీఓపెన్ అయ్యాయని తెలిపారు. రీ ఓపెన్ అయిన దరఖాస్తులపై నివేదిక ఇవ్వాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన 8 అంశాల్లో వాలంటీర్లతో ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి కావాలని ఎంపిడిఓ లను ఆదేశించారు.. మ్యారేజ్ సర్టిఫికెట్స్ పెండింగ్ లేకుండా గడువులోపు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.. కన్సిస్టెంట్ రిథమ్స్ కింద సచివాలయ సిబ్బంది పూర్తి స్థాయిలో పాఠశాలలను తనిఖీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డీఈవో, సమగ్ర శిక్ష పిఓ లను ఆదేశించారు..

# అభివృద్ధికి చిరునామా జగనన్న పాలన..

-గడప గడపలో మంత్రాలయం ఎంఎల్ఎ బాలనాగిరెడ్డి..



2లో

**కోసిగి నవంబరు 21, ప్రభాతవార్త :** సంక్షేమంతో పాటు అభివృద్దే చిరునామాగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని దీన్ని చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు దుర్భుద్దితో వ్యవహరిస్తున్నారని మంత్రాలయం ఎంఎల్ఎ బాలనాగిరెడ్డి పేర్కొన్నారు.. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల ఇంచార్జ్ మురళీమోహన్‌రెడ్డితో కలసి కోసిగిలోని రెండో సచివాలయం పరిధిలోని మూడు, నాలుగు వార్డులలో పర్యటించారు.. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సంజిపోగు అయ్యమ్మ అధ్యక్షతన, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి జగన్ మూడేళ్ల సంక్షేమ పాలనలో లబ్దిదారులకు చేకూర్చిన లబ్దిని గురించి వివరించారు.. అనంతరం ఎంఎల్ఎ బాలనాగిరెడ్డి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా ప్రతినిధులను ప్రజలకు మరింత చేరువ చేసిందని..



# శివనామస్మరణతో.. మారుమోగిన మహానందిక్షేత్రం..!

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

**మహానంది, నవంబరు 21, ప్రభాతవార్తః** ప్రముఖ శైవక్షేత్రమైన మహానంది క్షేత్రం శివనామ స్మరణతో మారుమోగింది. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో క్షేత్రానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే భక్తులు క్షేత్రానికి తరలివచ్చి క్యూలైన్లలో వేచివున్నారు. పుణ్యస్నానాలు అచరించి అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయంతో పాటు గరుధనంది, వినాయక ఆలయల్లో భక్తులు పోటేత్తారు. క్షేత్రానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం అన్నదాతలు స్వచ్ఛదంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలు భక్తుల అకలితీర్చారు. ఉదయం టిఫిన్‌తో పాటు భోజనవసతులు అన్నదాతలు కల్పించారు.

# వీబీఅర్‌లో చేపపిల్లలను.. వదిలిన ఎమ్మెల్యే శిల్పా

- 9.5లక్షల చేపపిల్లలు విడుదల..



**వెలుగోడు, నవంబరు21, ప్రభాతవార్త :** వెలుగోడు తెలుగుగంగ జలాశయంలో శ్రీశైల నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సోమవారం చేప పిల్లలను వదిలారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రాకతో మత్స్యకారులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రపంచ మత్స్యశాఖ దినోత్సవ సందర్భంగా మత్స్యకారులకు అయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మత్సకారులు అయనకు శాలువలు కప్పి పూలమాలలు వేసిఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ ఈ రోజు జలాశయంలో 3లక్షల కట్ల, 6.5లక్షల రోదు ఇలా 9.5 లక్షల చేప పిల్లలను విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం ఎంతో సంక్షేమ పథకా లను అమలు చేస్తుందన్నారు.. మత్స్యకారులు ప్రతి ఒక్కరు తప్పకుండా లైసెన్స్ పొంది ఉండాలన్నారు. ఈకార్యాక్రమంలో మత్స్య శాఖ జేడీ రాఘవరెడ్డి, ఎఫ్‌డీఓ భరత్‌లాల్ నాయక్, వెలుగోడు మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ వేల్పుల జయపాల్, ఎంపీపీ లాలం రమేష్, జిల్లా కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సులేమాన్, వైకాపా మండల పట్టణ అధ్యక్షులు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఇలియాస్ ఖాన్, వైకాపా ప్రధాన కార్యదర్శి రాంమోహన్‌రెడ్డి, దేశం తిరుపంరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, ష ఓషీర్ అలి, మాడల్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ సూర్యనారాయణ, రైతు సంఘం అధ్యక్షులు తెలుగు వెంకటరమణ, తెలుగు శ్రీనివాసులు, నాగరాజు, అరీఫ్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# 'రియల్' దందా.!

(మొదటి పేజీ తరువాయి)

విద్యా, వ్యాపార కేంద్రంగా భాసిల్లు తుండటం, పట్టణ జీవితంపై ఆసక్తితో చాలా మంది పల్లెవాసులు ఎమ్మిగనూరు బాట పట్టడంతో ఇక్కడి జీవన పరిస్థితుల్లో అన్యూహ్య మార్పులు వచ్చాయి. పట్టణానికి నలుదిక్కులు ఉన్న రోడ్లలో కళాశాలలు, వ్యాపార సంస్థలు ఏర్పాటు కావడంతో గత కొన్నేళ్లుగా భూముల ధరలు అమాంతంగా పెరిగాయి. దీంతో రియల్ ఎస్టేట్ దందా తెరపైకి రావడమే కాకుండా జిల్లాలో, ఏ పట్టణంలో కూడ పలకని భూమి ధర ఇక్కడ సెంటు పలుకు తుండంటే ఆతిశయోక్తే కాదు. ఇంటి స్థలాల ప్లాట్లకు ఎక్కడలేనంత డిమాండ్ ఉండటం, ఇప్పటికే రియల్ ఏస్టేట్ వ్యాపారంలో చేయి తిరిగిన కొంతమందికి బైర్లుకమ్మి ఆదాయం తమ సొంతమైంది. ఈ నేపథ్యంలో ఎమ్మిగనూరు పట్టణ శివారులోని హైకోండ ప్రాంతంలో ఓ రియల్ ఏస్టేట్ వ్యాపారి ఒక ఎకరనర వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి నూతన వెంచర్ వేయడం జరిగింది. ప్రభుత్వ ఆదాయానికి ఏలాంటి ఆదాయం చెల్లించకుండా భారీగా నూతన వెంచర్ ను ఏర్పాటు చేశాడు. అయితే అధికారులకు లక్షల్లో మామూళ్లు ముట్టచెప్పి ఈ నూతన వెంచర్ ను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ నూతన వెంచర్ నందు అందమైన మ్యాప్ను తయారు చేయడంతో పాటు ప్రస్తుతం ఆ వెంచర్లో మట్టి రోడ్లను వేస్తున్నాడు. వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు మునిసిపల్ శాఖకు మార్కెట్ విలువ ఆదారంగా చెల్లించాల్సి ఫీజును చెల్లించాక కొంత శాతాన్ని స్టాంప్ డ్యూటీని చెల్లించి రిజిష్టర్ చేసుకోవాల్సి ఉంది. అయితే ఏ ఒక్క ప్రభుత్వ శాఖకు పైసా కూడ చెల్లించకుండా కేవలం రైతుల వద్ద అగ్రిమెంట్ మాత్రమే చేసుకొని అందమైన మ్యాప్ను చూపుతూ సెంటు స్థలానికి లక్షలు వసూళ్లు చేస్తూ విక్రయాలు ప్రారంభిం చాడు. ప్లాట్లు కొన్న వారికి పొలాల రైతులతోనే రిజిస్ట్రేషన్ చేయించి తాను చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ నుండి తప్పించుకుంటున్నాడు. ఇక లేఔట్ నిబంధనల ప్రకారం ప్రదాన రహదారులకు 40 అడుగులు, అంతర్గత రహదారులకు 33 అడుగుల రోడ్లు వేయాల్సి ఉండగా మ్యాప్లో మాత్రం వాటిని చూపి వెంచర్లలో మాత్రం రోడ్ల సైజులను తగ్గిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే గత మునిసిపల్ కమిషనర్ ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న వెంచర్లను పరిశీలించి లే అవుట్లు లేకపోవడం, కన్వర్షన్ కాకపోవడం వల్ల వాటిని ఆన్లైన్ చేయలేదు. వాటిని రిజిస్ట్రేషన్ చేయవద్దని కోరారు. ఇలా ఖాళీ స్థలాల పేరుమీద రిజిస్ట్రేషన్ కాకుండా ఆయన చర్యలు తీసుకు న్నారు. కొంతమంది రియల్ ఏస్టేట్ దారులు రాజకీయ పలుకుబడి వల్ల ఒత్తిడి తెచ్చుకుంటూ రిజిస్ట్రేషన్లను కన్వర్షన్ లేకుండానే చేయించుకు న్నట్లు సమాచారం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తమకు అనుకూలమైన వారిని ఉండే విధంగా చూసుకుంటూ రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకున్నా రనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ నిబందనల ప్రకారం రిజిస్ట్రేషన్లు చేసే సమయంలో ఖాళీ స్థలాల ధ్రువీకరణ ప్రతాలతో పాటు వాటికి సంబంధించిన లింకు డాక్యూమెంట్లను పరిశీలిం చిన తర్వాతనే రిజిస్ట్రేషన్లు చేయాలి. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు అధికారులకు ముడుపులు ముట్టచెప్పి గుట్టుచప్పుడుగా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఎమ్మిగనూరులో అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ శాఖకు ఏలాంటి ఆదాయ పన్ను చెల్లించ కుండా ప్రభుత్వ ఆదాయ పన్ను శాఖకు భారీగా గండి కొడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**- చర్యలకు అధికారులు వెనకడుగు.!**

ఎమ్మిగనూరు పట్టణంలో, గ్రామీణ ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నూతన వెంచర్లపై ఇటు మున్సిపల్ అధికారులు, అటు రెవిన్యూ అధికారులు నోరు మెదపడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని హైకోండ దగ్గర ఏకరనర, మండల పరిధిలోని గుడికల్ గ్రామ సమీపంలో నూతన వెంచర్ లు ఏర్పాటు చేసి ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి రియల్ దందా జోరుగా కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఏలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా వెంచర్లు వేసి సెంట్ స్థలానికి లక్షల్లో వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వెంచర్లపై అధికారులు చర్యలు తీసుకొకుండా ఫైసల్ వసూల్ చేసుకొని చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకోక్క అధికారికి దాదాపు లక్షల రూపాయలు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముట్టచెప్పినట్లు ఆరోపణలు వినిపిస్తు న్నాయి. దీంతో కళ్లముందు అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా వాటిపై చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయా నికి భారీగా గండి కొడుతున్నా పట్టించుకొవడం లేదనే విమర్శలు ఉన్నాయి. గత కొన్ని నెలల క్రితం అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకొని ఆన్లైన్, రిజిస్ట్రేషన్ నిలుపుదల చేశారు. కొద్ది రోజుల అనంతరం తిరిగి రిజిస్ట్రేషన్ చేయడం మొదలు పెట్టడంతో అధికారులపై పలు అనుమా నాలు వ్యక్తమౌతున్నాయి. కోట్లలో వ్యాపారం జరుగుతున్నందున ఆదాయ పన్ను శాఖ అధికా రులు ఈ వెంచర్ల నిర్వహకుల లావాదేవీలపై నిఘా ఉంచితే లక్షల్లో ఆదాయ పన్ను రూపంలో ప్రభుత్వానికి చేరుతుంది. ఆ దిశగా ఆదాయ పన్ను శాఖ అధికారులు దృష్టి సారిస్తారో.? లేదా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇచ్చే కాసుల కక్కుర్తి పడి వదిలేస్తారో.? వేచి చూడాల్సిందే అంటున్నారు ప్రజలు.

## అకౌంటెంటు జనరల్ అధికారుల వింత లీలలు

(మొదటి పేజీ తరువాయి) ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల నుంచి 8 వేల వరకు వసూలు చేస్తున్నారంటే అవినీతి ఏస్థాయిలో ఉందో అర్థమవుతుంది. ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి అవినీతికి అస్కారం లేని విధంగా పనులు చేయాలని అధికారులను అదేశించినా క్రిందిస్థాయిలో అమలుకావడం లేదు. జిల్లా ట్రెజరీ అధికారి లక్ష్మీదేవి వివరణ: గతరెండు నెలల కాలం నుంచి పెన్షనర్లకు సంబంధించిన ప్రతిపాదనల కాగితాలు ఉమ్మడి కర్నూలు జిల్లాకు వచ్చాయని గత పదిహేనురోజుల క్రితం నుంచే నంద్యాల జిల్లాకు పెన్షనర్ల కాగితాలు చ్చాయని దాదాపుగా 200మంది పెన్షనర్ల ప్రతిపాదన కాగితాలు వచ్చాయని వీటిని 20 రోజుల్లో క్లియర్చేస్తామని,జిల్లాలోని ట్రెజరీ కార్యాలయాల్లో ఎలాంటి అవినీతి అస్కారం లేకుండా పనులు చేయాలని సిబ్బందికి అదేశించామని ఆమె వివరణ ఇచ్చారు.

## అభివృద్ధికి చిరునామా జగనన్న పాలన..

(మొదటి పేజీ తరువాయి) ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని తెలిపారు.. ముఖ్యంగ్గా గ్రామ స్వరాజ్యం, సమ సమాజం ఆచరణలో అమలు చేస్తున్న ఆదర్శ నాయకుడు జగనన్న అని అన్నారు.. మాటిస్తే అమలు చేసి తీరుతాడన్న నమ్మకాన్ని ప్రజల్లో నిలుపుకున్న నేత మన జగనన్న అని, సంక్షేమ కార్యక్రమాల వెల్లువను సృష్టించిన ఘనత దేశ చరిత్రలో ఒకే ఒక్కనికి దక్కుతుందని, అతడే మన ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి అని అన్నారు..జగనన్న జన హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందారని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా స్పష్టంగా తెలుస్తోందన్నారు.. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లవకుశ ఈరన్న, మండల కన్వీనర్ బెట్టన్న గౌడ్, సీనియర్ నాయకులు నాడిగేని నరసింహులు, మాణిక్యరాజు, దళవాయి మంగమ్మ, హోళగుంద కోసిగయ్య, జగదీష్స్వామి, సంజిపోగు రాజేష్, ఇంజనీర్లు యుగంధర్రెడ్డి, మల్లికార్జునరెడ్డి, షేక్షావలి, ఐసిడిఎస్ సూపర్వైజర్ గురుశేఖరమ్మ, ఆర్ఐ శ్రీరాములు, వెలుగు ఏపియం సత్యమ్మ, ఉపాధి ఏపివో జయరామ్, నాయకులు నాడిగేని నాగరాజు, పందికోన నాగేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, నాయకలు, తదితరులు పాల్గొన్నారు..

## స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

**తుగ్గలి,నవంబరు 21,ప్రభాతవార్త :** గ్రామాలలో స్వచ్ఛభారత్ కింద పనిచేస్తున్న కార్మికులకు రెగ్యులర్గా వేతనాలు ఇవ్వాలని, గ్రామ పంచాయితీకి ఏ మాత్రం సంబందం లేకుండా వారి ఖాతాల్లోకి నేరుగా వేతనాలు వేయాలని కోరుతూ సిఐటియు మండల కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు రంగస్వామి,ప్రతాప్, మద్దిలేటిలు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలిలో ఏఐటీయూసీ నాయకులు ప్రధాన రహదారిపై ర్యాలీగా వచ్చి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు అంజి,సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ గ్రామాలలో స్వచ్ఛ భారత్ కింద పని చేసే కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. వారికి వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఉదయం నుండి సాయంత్రం దాకా కాలువలలో చెత్తచెదారాన్ని తీసివేసే కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. నెలలు గడుస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు అందకపోవడంతో ఆందోళనకు గురికాక తప్పడం లేదన్నారు. గ్రామ పంచాయితీకి వేతనాలు లింకు పెట్టి ఇవ్వకపోవడం మరీ దారుణమ న్నారు. ఇలాగే కొనసాగితే పారిశుద్ధ కార్మికుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్రామాలలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి,వారికి ఉద్యోగ భద్రతను కల్పించాలని,ఆరోగ్య కార్డులను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి కొండారెడ్డి,వ్యవసాయ కార్మిక సంఘము అధ్యక్షులు మద్దిలేటి,ఆనందు,రంగన్న,ఆంజనేయులు,బెన్నీ,రామాంజినేయులుతో పాటు వివిద గ్రామాలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు.

## జి.ఓ.నం.53ను ప్రభుత్వం ఉపసంహారించుకోవాలి

**కర్నూలు న్యూసిటి, నవంబరు 21, ప్రభాతవార్త:** మాదాసి మరియు మదారి కురువ అనే కులాలకు ఎస్సీ హోదా కల్పిస్తు జిఓ నం.53ను సాంఘీక సంక్షేమశాఖ తహశీల్దార్ల ఈ కులాలకు కులధృవీకరణ పత్రాలు ఇచ్చే అధికారిన్ని ఇస్తు జారీచేసిన జిఓను ప్రభుత్వం ఉపసంహారించుకోవాలని షెడ్యూల్ కులాల రిజర్వేషన్ పరిరక్షణ సమితి అద్వర్యంలో ధర్నా నిర్వహించారు. దళిత సంఘాల జెఏసి నాయకులు సోమసుందరం, వెల్పుల జ్యోతి, రాగిరి చంద్రప్ప, దామోదరం రాధకృష్ణ, పేరపొగు పెద్ద లక్ష్మన్న, దరూరు గోపి, డి. జయరాముడు, బుధవార పేట బాబు, రాజు, బతుకన్న, దరూరు జేమ్స్లు మాట్లాడుతూ షెడ్యూల్ కులాల జాబితా నుంచి ఒక కులాన్ని తీసివేయాలన్నా, ఒక కులాన్నిచేర్చాలన్నా రాష్ట్ర ప్రభుత్వాలకుచేర్చే అధికారం లేదన్నారు. అన్యాయానికి గురైనా, వెనకబాటుతనంతో వున్న కులాలను యస్సి జాబితాలో చేర్చాలనుకుంటే పార్లమెంటు అమోదం తప్పనిసరి అని అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికి రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని కులాలను ఎస్సీ జాబితాలో చేర్చిన విషయం తెలుపుతున్నామన్నారు.

## జీవితంలో గెలుపోటములు సహజం

**- క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి**

**నంద్యాల విద్య, నవంబరు 21, ప్రభాతవార్త:**

జీవితంలో గెలుపోటములు సహజమేనని గెలుపుకు మొదటి మెట్టు అని ఓడిన వారిని ప్రోత్సహించాలి. ఓడిన వారు నిరుత్సాహపడకుండా ప్రయత్నిస్తుంటునే విజయం లభిస్తుందని రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డా.జి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. పిజి కళాశాల యందు రాయలసీమ యూనివర్శిటి షటిల్ బాడ్మింటన్, టెబుల్ టెన్నిస్, మెన్ అండ్ ఉమెన్ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిధులుగా జిల్లా స్పోర్ట్స్ అధారిటి చీఫ్ కోచ్ ఎంఎస్వి రాజు, రాయలసీమ యూనివర్శిటి ఫిజికల్ ఎడ్యూకేషన్ సెక్రెటరి శివకుమార్, కళాశాల డైరెక్టర్ హేమంత్రెడ్డిలు పాల్గొన్నారు. ఈటోర్నమెంట్కు 17 జట్లు హాజరయ్యాయి. టోర్నమెంట్లు, క్రీడలు ఆడటం వల్ల విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, జ్ఞానం, ఆరోగ్యం, మెరుగుపడుతుందని పేర్కొన్నారు. షటిల్ బాడ్మింటన్ పోటీల్లో శ్రీరామకృష్ణ, డిగ్రీ, అండ్ పిజి కళాశాల మొదటిస్థానంలో బసిరెడ్డి డిగ్రీ కళాశాల రెండవస్థానంలో రాయలసీమ యూనివర్శిటి డిగ్రీ కళాశాల మూడవస్థానంలో నిలిచారు. టెబుల్ టెన్నిస్ విభాగంలో బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటిస్థానంలో, ఉస్మానియా కళాశాల రెండవస్థానం, రామకృష్ణ డిగ్రీ, పిజి కళాశాల మూడవస్థానంలో నిలిచారు. గెలుపొందిన విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు.

## పోతిరెడ్డిపాడు ప్రాజెక్టును వడ్డె ఓబన్న ప్రాజెక్టుగా పేరుమార్చాలి

**నంద్యాల, నవంబరు 21, ప్రభాతవార్త:**

నంద్యాల జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న రాయలసీమ ప్రాంత అభివృద్ధి కోసం బ్రిటీష్వారితో ఎదిరించిన గొప్ప వ్యక్తి అని రాయలసీమ రైతులు వారు ఆయనను స్మరించుకునేలా పోతిరెడ్డి పాడు ప్రాజెక్టును వడ్డె ఓబన్న ప్రాజెక్టుగా పేరుమార్చాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి. సోమవారం జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్కు జాతీయ బిసి కార్యదర్శి బత్తుల సంజీవరాయుడు, అఖిల భారత వడ్డె ఓబన్న సేవా సమితి నిర్వాహకులు బాల నరసింహులు, భారత మానవహక్కుల సంస్థ ఈగల్ (ఐ) జాతీయ కార్యదర్శి గోగుల గోపాల్లు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు అనాడు రైతుల హక్కులను కాలరాస్తు బ్రిటీష్ పాలకులు ప్రవేశపెట్టిన అధిక పన్నులకు వ్యతిరేకంగా పాలకులను గడగడలాడించిన స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్నను స్మరించుకోవడం మనబాధ్యత అంటూ పేర్కొన్నారు. జిల్లా కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు.

## కళాశాల నిర్లక్ష్యంతో విద్యార్థులకు నష్టం

**కర్నూలు విద్య , నవంబరు 21, ప్రభాతవార్త:** నగరంలోని శంకరాస్ డిగ్రీ కళాశాల నందు పిజి రెండవ సెమిస్టర్ సప్లమెంటరీ ఫీజు గడువు తేది చెప్పకుండా నిర్లక్ష్యం వహించి విద్యార్థుల దగ్గర భారీగా ఫైన్ వసూలు చేశారని విద్యార్థులు వాపోతున్నారు. ఈవిషయం మీడియా మేనేజ్మెంటు వారిని విచారించగా అవును విద్యార్థులకు చెప్పడం మరిచిపోయాం అంత చిన్న అమౌంటు కట్టుకోలేరా అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని తెలిపారు. శంకరాస్ డిగ్రీ కళాశాల మేనేజ్మెంటుపై యూనివర్శిటి వారు తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

## నూతన ఏజీపీగా అంజనప్ప నియామకం

**ఆదోనిలీగల్, నవంబర్21, ప్రభాతవార్త ;** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మరియు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఎస్.అంజనప్పను ప్రభుత్వ న్యాయవాదిగా నియమించింది. తన నియామకానికి సహకరించిన ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసీపీ యువ నాయకులు ప్రదీప్రెడ్డి, ధరణిరెడ్డి, మనోజ్రెడ్డి, తోటి న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అంకితభావంతో విధులు నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

## లోడింగ్ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**బేతంచెర్ల, నవంబర్21,ప్రభాతవార్త:** పట్టణంలోని రావ్బహదూర్ బీపీ శేషారెడ్డి పార్కు సమీపంలో నివాసముంటున్న గోపాల్రెడ్డి అనే లోడింగ్ కార్మికుని కుటుంబానికి లోడింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు రాఘవరెడ్డి,ఉపాధ్యక్షులు ఎర్రమల్లలు సోమవారం ఆర్థిక సహాయం అందించారు.గోపాల్రెడ్డి ఆకస్మికంగా మృతి చెందడంతో విషయం తెలుసుకున్న లోడింగ్ యూనియన్ ప్రతినిధులు కార్మికులతో కలిసి వెళ్లి భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులర్పించి కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు.అనంతరం అంత్యక్రియల నిమిత్తం రూ.6వేలు ఆర్థిక సహాయాన్ని భార్య యల్ల నాగేశ్వరికి అందించారు.ఈ కార్య క్రమంలో లోడింగ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్పందనలో కనిపించని పలువురు అధికారులు

**అవుకు, నవంబర్21,ప్రభాతవార్త:** అవుకు మండలంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో పలు మండల అధికారులు కనిపించలేదు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమానికి ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడానికి భారీ ఎత్తున వస్తున్నారు.కాని అవుకు మండలంలోని ప్రజలు తమ సమస్యలను చెప్పడానికి వస్తే పలువురు అధికారులు కనిపించడంలేదు.అధికారులు పదే పదే స్పందన కార్యక్రమం పై నిర్లక్ష్యం వహించకూడదని చెప్పినా ఆ నియమాలకు కొందరు అధికారులు తూట్లు పొడుస్తున్నారు.సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి అన్ని శాఖలకు సంబంధించిన మండల అధికారులు పాల్గొనాలి.కాని స్పందన కార్యక్రమానికి సంబంధించిన రిజిస్టర్లో 12 మంది అధికారులు సంతకాలు చేయగా మధ్యాహ్న 12 గంటల సమయానికి స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు,మండల అభివృద్ధి అధికారి ఆజాంఖాన్,ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరమ్మ,వ్యవసాయాధికారి ప్రసాదరావు మాత్రమే ఉన్నారు.మండలంలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు తమ సమస్యలను స్పందన కార్యక్రమంలో అర్జీల రూపంలో ఇచ్చేందుకు రాగా ఇవేమి మాకు సంబంధంలేదు అన్నట్లుగా 8 మంది అధికారులు సమావేశంలో లేకపోవడంతో అర్జీదారులు అవాక్కయ్యారు.మండలస్థాయి అధికారులే నిర్లక్ష్యం వహిస్తుంటే కిందిస్థాయి ఉద్యోగుల పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కోడుమూరులో వైభవంగా కార్తీక మాసోత్సవ వేడుకలు

**కోడుమూరు , నవంబర్ 21 ప్రభాతవార్త :** స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసోత్సవ వేడుకలు వైభవంగా సాగాయి. ప్రతి రోజు నిర్వహిస్తున్న వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు. గత రాత్రి ఆలయం సన్నిధిలో ఆలయ కమిటి నిర్వాహుకులు పట్టణంలో శివ మాలాధరణ చేసిన భక్తులచే కార్తీక మాసోత్సవ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం 6.00 గంటల నుంచి ప్రారంభమైన కార్తీక పూజలు రాత్రి పది గంటల వరకు సాగాయి. అనంతరం ఆలయ కమిటి చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఇక్కడికి వచ్చిన శివ భక్తులకు బిక్ష ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహుకులు పెనుమాడ రాజశేఖర్, ఎద్దుల సూర్యారెడ్డి, వేణు, తిమ్మారెడ్డి,వెంకటేశ్వరరెడ్డిలు ఉన్నారు.

## గోనెగండ్లలో చర్మవ్యాధితో కుక్కలు

**గోనెగండ్ల నవంబరు 21 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన గోనెగండ్లలోని చదువుల రామయ్య కాలనీ, లక్ష్మిపేట,మొట్టి వీదిలో కుక్కలకు చర్మవ్యాధి సోకడంతో ఆ కాలనీ వాసులు అందోళన వ్యక్తం చేస్తున్నారు.ఆయా కాలనీలో దాదాపు 40 కుక్కలు వింత చర్మ వ్యాధిలతో బాధపడుతున్నాయని కుక్కలకు చర్మం మొత్తం ఊడిపోయి రక్తం చీము కారుతుందని కాలనీ వాసులు తెలుపుతున్నారు.ఈ వ్యాధి అంటు వ్యాధిగా మారి కాలనీ వాసులకు వస్తే ఇబ్బందిగా ఉంటుందని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు.కావున అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## జననీ బ్యాంకు నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరము

**కోవెలకుంట్ల, 21,ప్రభాతవార్త :** జననీ పరస్పర సహకార బ్యాంకు నేతృత్వంలో నేడు ఉచిత వైద్యశిబిరము ఏర్పాట్లు చేస్తున్నట్లు బ్యాంకు అదికారులు చెప్పారు. ఈశిబిరములో నంద్యాల శాంతిరాం అసుపత్రి వైద్యులు వైద్యపరీక్షలు చేస్తారని చెప్పారు. ఉదయం 10గంటల నుండి సాయంత్రము 3గంటల వరకు వైద్యులు పరీక్షలు చేస్తారని చెప్పారు.ఇందులో బిపి, షుగరు, ఇసిజిపరీక్షలు దగ్గు అయాసం, ఫిట్స్,(మూర్చ)తలనొప్పి, అర్థో(ఎముకలు, కీళ్లు) అలర్జీ, అస్తమా అన్ని రకముల జనరల్ పరీక్షలు చేస్తారని చెప్పారు. పరీల అనంతరము మందులను కూడా ఉచితంగా అందించడము జరుగుతుందని చెప్పారు. ఈ పరీక్షలు పట్టణంలోని గడ్డవీదిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## 2020 రబీ పంటల సున్నా వడ్డీ జమ కాకపోతే అర్బికెను సంప్రదించండి

**కోవెలకుంట్ల,నవంబరు 21,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం రైతు సోదరులను అర్థికంగా అదుకునేందుకు మంజూరు చేసిన సున్నా వడ్డీ బ్యాంకు ఖాతాలో జమ కాకపోతే స్థానిక అర్బికెలను సంప్రదించాలని ఎడిఎ నిరంజన్ చెప్పారు. మాట్లాడుతూ ప్రభుత్వం 2020 సంవత్సరమునకు సందించిన రబీ పంటలకు సునా న్నవడ్డీ రుఫమాపీ పథకము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కాక పోతే అయా అర్బికెలను సంప్రదించాలని చెప్పారు. ఈ నెల 29న తేదిన ప్రభుత్వం వడ్డీ మొత్తం రైతుల అకౌంటుకు జమ చేస్తుందని చెప్పారు. దీనికి సంబందించి అబ్దిదారులు వివరాలు మీ గ్రామ అర్బికె నందు సామాజిక తనికీ నిమిత్తం సోమవారము ప్రదర్శించడము జరుగుతుందని చెప్పారు. రైతులు వారి బ్యాంకు వివరాలు కరెక్టుగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని చెప్పారు.అర్హత ఉండి లిస్టులో పేరు లేని రైతులు బ్యాంకు మేనేజరు దృవకరణ పత్రముతో అర్బికె నందు వ్యవసాయ శాఖ సహాయకులకు తమ పిర్యాదులు ఇవ్వాలని చెప్పారు. త్వరలో 2021 సంబందించిన లబ్దిదారుల వివరాలు కూడా అర్బికె నందు సామాజిక తనికి నిమిత్తం ఉంచము జరుగుతుందని చెప్పారు.

## రాజగోపురం నిర్మాణానికి విరాళం అందజేత

**కౌతాళం, నవంబర్21, ప్రభాతవార్త ;** మండలంలోని ఉరుకుంద ఈరన్నస్వామి (లక్ష్మినరసింహస్వామి) దేవస్థానం రాజగోపురం నిర్మాణానికి సోమవారం బళ్లారికి చెందిన వై.జి.హేమంత్ రాజ్ రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. దాతలకు దేవస్థాన ఆలయ అధికారులు, స్వామివారి దర్శనం కల్పించి ఆశీర్వాలు, స్వామివారి శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, బాండును అందించి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారి రాజగోపురం నిర్మాణానికి విరాళం అందించాలని మొక్కుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే అందించామన్నారు. మున్ముందు కూడా స్వామివారి ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, వేద పండిట్ మురళీమోహన్శర్మ, శివపుత్రస్వామి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**- ఈరన్నస్వామి వారికి వెండి హారతి పళ్లెం విరాళం :**

ఉరుకుంద ఈరన్నస్వామి వారి దేవస్థానానికి బళ్లారికి చెందిన వై.జి. విశ్వనాథ్ 1.30 కేజీల వెండి హారతి పళ్లెంను విరాళంగా ఎల్లించారు. దాతలకు దేవస్థాన ఆలయ అధికారులు స్వామి దర్శనం, స్వామివారి శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వాదం కల్పించి రశీదు అందించారు. పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ స్వామివారి ఆలయానికి వెండి హారతి పళ్లెం అందించాలని మొక్కుకోవడం జరిగిందని, ఇందులో భాగంగానే అందజేసినట్లు చెప్పారు. మున్ముందు కూడా స్వామివారి ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని చెప్పారు.

## కార్తీకశోభతో కళకళలాడిన బ్రహ్మగుండం

**- బ్రహ్మేశ్వరస్వామికి అయ్యప్పస్వామి స్వయంపాకంను సమర్పించిన అయ్యప్పభక్తులు..**

**- భక్తులకు బ్రహ్మేశ్వరమైన్స్ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు..**

**వెల్దుర్తి, నవంబర్21,ప్రభాతవార్త :** ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రాలలో ఒకటైన బ్రహ్మగుండం పుణ్యక్షేత్రంలో కార్తీకమాసం కడసోమవారం కావడంతో అశేషసంఖ్యలో భక్తులు హాజరై కామేశ్వరిసహిత బ్రహ్మేశ్వర స్వామిని,అమ్మవారిని దర్శించుకున్నారు.బ్రహ్మగుండం ఆలయ కమిటీ చైర్మెన్ బొమ్మనపెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఇఒ హనుమంతరావు,ఆలయ సిబ్బంది,కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు.ముందుగా చైర్మెన్ కుటుంబసమేతంగా బ్రహ్మేశ్వరస్వామి, అమ్మవార్లకు ప్రత్యేకపూజలు చేశారు.వెల్దుర్తి పట్టణ సమీపంలోని జర్నలిస్టుకాలనీలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం నుంచి అయ్యప్పమాలాధారణ భక్తులు గురుస్వామి రామక్రిష్ణ,అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు చిరంజీవి,మధు,మాలాధారణభక్తులు అయ్యప్పస్వామి స్వయంపాకంకు సంబంధించిన బియ్యం,బ్యాళ్లు తీసుకొని కాలినడకన బాజభజంత్రీలతో పేట తుళ్లి ఆడుకుంటూ బ్రహ్మగుండం చేరుకొని చైర్మెన్,ఇఒతో కలిసి బ్రహ్మేశ్వరస్వామికి సమర్పించి పూజలు చేశారు. కార్తీకమాసం కడసోమవారం సందర్భంగా బ్రహ్మగుండంకు వచ్చిన భక్తులందరికి బ్రహ్మేశ్వరమైన్స్ నిర్వాహకులు గౌరివెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వెంకటేశ్వరరెడ్డి,కళ్యాణ్కుమార్రెడ్డి కుటుంబసమేతంగా హాజరై భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఆలయకమిటీ సభ్యులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిసి మేనేజ్మెంట్ కళాశాలల బాలికల హాస్టళ్లకు స్థలం కేటాయించాలి

**ఆలూరు,నవంబరు 21,ప్రభాతవార్త :** బిసి మేనేజ్మెంట్ కళాశాలల బాలికల హాస్టళ్లకు స్థలం కేటాయించాలని ఎస్ఎఫ్ఐ ఆద్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నందు ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కమిటీ ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాకు మహిళా సంఘం(ఐద్వా) మద్దతు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మహిళా సంఘం(ఐద్వా)జిల్లా నాయకురాలు శేఖున్బీ,ఎస్ఎఫ్ఐ గర్ల్స్ మండల కోకన్వీనర్ ఇందుశ్రీ,మండల నాయకురాలు సుమలతలు మాట్లాడుతూ ఆలూరు పట్టణ కేంద్రంలో అరికెర రోడ్డులో ఉన్న బిసి మేనేజ్మెంట్ కళాశాలల బాలికల హాస్టళ్లలో ఇంటర్మీడియట్,ఐటిఐ,పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థినీలు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న హాస్టల్ అద్దెభవనంలో కొనసాగుతుందన్నారు. ఈ హాస్టల్ పక్కనే పాఠశాలల విద్యార్థుల సమీకృత బాలుర వసతి గృహం(సాంఘీక సంక్షేమ హాస్టల్) స్థలంలో గతంలో నిర్మించిన పాత హాస్టల్ భవనం కూలిపోయి స్థలం నియోపయోగంగా మారిపోయిందన్నారు. ఆ స్థలాన్ని బాలికల ఉన్నత విద్య అభివృద్ధి ప్రోత్సాహం కొరకు ఆ స్థలాన్ని బిసి మేనేజ్మెంట్ కళాశాలల బాలికల హాస్టళ్లకు కేటాయించాలన్నారు. అనంతరం ఆర్ఐ బసన్నగౌడ్కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకురాలు రాణి,సుస్మిత,ఉషా, రాజేశ్వరి,విద్యార్థినీలు పాల్గొన్నారు.

## గ్రంధాలయాలు విజ్ఞాన కేంద్రాలు

**- జడ్పిటిసి ఏరూరు శేఖర్**

**ఆలూరు,నవంబరు 21,ప్రభాతవార్త :** గ్రంధాలయాలు విజ్ఞాన కేంద్రాలు అని ఆలూరు జడ్పిటిసి ఏరూరు శేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలోని గ్రంధాలయంలో గ్రంధాలయ అధికారి విజయభాస్కర్ ఆద్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రంధాలయానికి నూతన భవననిర్మించేందుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు.మాజీ గ్రంధాలయ చైర్మన్ రామ్మూర్తి,ఉపాధ్యాయులు మంజుల, రామ్మోహన్నాయుడు, వైకాపా నాయకులు జీరాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట జరుగు ధర్నాను జయప్రదం చేయండి

**ఆస్పరి,నవంబరు 21,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉద్యోగులకు ఉపాధ్యాయులకు చెల్లించవలసిన పిఎఫ్,ఏపిజిఎల్ఐ,డిఏ అరియర్స్,మెడికల్ రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ నేడు ఉమ్మడి జిల్లా కలెక్టరేట్ల వద్ద యుటిఎఫ్ ఆద్వర్యంలో జరుగు ధర్నాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దేవపాల్ పిలుపునిచ్చారు. సోమవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల బకాయిలు,సిపిఎస్ రద్దు,కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్తో పాటు రాష్ట్రంలో పెద్దఎత్తున విద్యారంగంలో పేరుకుపోయిన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. పిఆర్సి చర్చల సందర్భంగా పిఎఫ్,ఏపిజిఎల్ఐ,డిఏ అరియర్స్,మెడికల్ రీయింబర్స్మెంట్ బకాయిలు మరియు పదవీ విరమణ చేసిన ఉద్యోగుల ప్రయోజనాలు సుమారు రూ.650కోట్ల బకాయిలు ఉన్నాయని వాటిని 2022మార్చిలోగా చెల్లిస్తామని నమ్మించారన్నారు. అనంతరం యుటిఎఫ్ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బాబు,గోపిలు మాట్లాడుతూ ఉద్యోగులు వారి బిడ్డల చదువులు,వివాహాలు,కుటుంబ సభ్యుల వైద్య చికిత్స తదితర కారణాలతో దరఖాస్తు చేసిన పిఎఫ్ పార్ట్ ఫైనాన్స్ మంజూరైనప్పటిక సకాలంలో ఖాతాలకు సొమ్ము జమకాకపోవడంతో అవసరాలు తీరక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు నేడు ఉమ్మడి కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని ఈ ధర్నాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ సీనియర్ నాయకులు,కార్యకర్తలు రాముడు,ఆదెప్ప,కృష్ణుడు,రాజు,మోదిన్భాష, సుంకన్న, వెంకటరాముడు,అల్లన్న,రామాంజినేయులు,శివ, రాజు,ఖలీల్,విజయనంద్ తదితరులున్నారు.

## అందరికి అందుబాటులో ఉంటా..

**- తహశీల్దార్ డి హుసేన్సాబ్**

**హొళగుంద,నవంబరు 21,ప్రభాతవార్త :** మండలంలోని రైతులు,ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తహశీల్దార్ డి హుసేన్సాబ్ అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో హొళగుంద మండల రెగ్యులర్ తహశీల్దార్గా హుసేన్సాబ్ భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలూరు తహశీల్దార్ కార్యాలయం నుండి బదిలీపై హొళగుంద తహశీల్దార్ కార్యాలయానికి వచ్చానన్నారు. మండల రైతులు,ప్రజలకు ఏవైన రెవెన్యూ సమస్యలుంటే తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

## 25న మండల సర్వసభ్య సమావేశం

**మద్దికెర,నవంబరు 21,ప్రభాతవార్త :** ఈ నెల 25న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ నరసింహమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 25న ఎంపిడిఓ కార్యాలయం నందు 11గంటలకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు,ఎంపిటిసిలు, సర్పంచ్లు ఈ సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

## పందికోన రిజర్వాయర్కు పూర్తిస్థాయి నీటిమట్టం నింపాలి

**పత్తికొండ, నవంబరు 21,ప్రభాతవార్త :** హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా ప్రవహించు నీటిని పందికోన రిజర్వాయర్లోకి పూర్తిస్థాయి నీటిమట్టం నింపాలని ఏపి రైతుసంఘం తాలుక కార్యదర్శి కె పెద్దఈరన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం వారు తహశీల్దార్కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా నిండుగా నీరుపోతున్నాయని అయితే ఇరిగేషన్ అధికారులు డిసెంబరు చివరి దాకా లేక జనవరి 15వ తేదీ నాటికి శ్రీశైలం జలాశయానికి 834అడుగుల దిగువకు చేరేదానికి అవకాశం ఉందికనుక నీటిని నిలిపివేయడం జరుగుతుందని ఈ విషయాన్ని రైతులకు తెలియజేయండని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు పంపడం జరిగిందన్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా 29,ప్యాకేజీ కింద పందికోన రిజర్వాయర్ కింద కుడి,ఎడమ కాలువలకు దాదాపు 32వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. అయితే ఇప్పటికే రిజర్వాయర్లో నీటి నిల్వ చాలా తక్కువగా ఉందని అయితే ఎడమ కాలువ కింద దూదేకొండ,కోతిరాళ్ల,కనకదిన్నె, మత్తుకూరు,మండగిరి,అగ్రహారం,జెఎం తాండ గ్రామాల నుండి రైతులు ప్రైవేటు అప్పులు కోసి రబీలో పంటలు వేసుకోవడం జరిగిందని కావున పందికోన రిజర్వాయర్లోకి గేట్లు ఎత్తి నీటినింపేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలేష్,అశోక్,రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థుల వలసల నివారణకు చర్యలు చేపట్టాలి

**కోసిగి, నవంబరు 21 ప్రభాతవార్త :** ఉపాధి కరువై తల్లిదండ్రులతో పాటు వలసలు వెళ్తున్న విద్యార్థుల వలసల నివారణకు జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేసారు.. సోమవారం స్థానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో పిడిఎస్యు జిల్లా సహాయ కార్యదర్శి వినోద్ అధ్యక్షతన మహాసభ సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా హాజరైన జిల్లా ప్రదాన కార్యదర్శి మహేంద్రబాబు మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు పశ్చిమ ప్రాంతాలైన కోసిగి, మంత్రాలయం, పెద్దకడబూరు, కౌతాళం మండలాలల్లో వలసలు ఎక్కువగా ఉన్నాయన్నారు..ఉపాధి కరువై బ్రతుకు తెరవు కోసం ఇతర ప్రాంతాలకు ప్రజలు వలసలు వెళ్తున్నారన్నారు.. అయితే పెద్దలు మాత్రం వలసలు వెళ్లకుండా తమతో పాటు తమ పిల్లలను కూడా వెంట తీసుకుని వెళ్తుండడంతో బాల్యం చితికిపోతోంద న్నారు.. ముఖ్యంగా పాఠశాలల్లో చదువు నేర్చుకునే పిల్లలను సైతం వలసలకు తీసుకెళ్తున్నారని, ఎక్కడో తెలియని ప్రాంతంలో ఉంటూ పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.. ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం విఫలమయిందని, అలాగే వలసలు వెళ్లకుండా ఇక్కడే ఉపాధి పనులు కల్పిస్తే బాగుంటుందన్నారు.. అంతేకాక పిల్లలను తమ వెంట తీసుకుని వెళ్లకుండ ఇదే ప్రాంతంలో సీజనల్ హాస్టల్స్ను ప్రారంభించి పిల్లలకు వసతులతో పాటు చదువును నేర్పించాలని డిమాండ్ చేసారు.. మరీ ముఖ్యంగా కోసిగి ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీలు చేయడానికి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, కావున ప్రభుత్వం స్పందించి కోసిగి ప్రాంతంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు.. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్నారు.. పిడిఎస్యు అధ్యక్షులుగా వీరేష్, కార్యదర్శిగా వెంకటేశ్లతో పాటు మరో 9 మందిని కమిటి సభ్యులుగా ఎన్నుకున్నారు..అలాగే మహిళా కమిటి అధ్యక్షులుగా నందిని, కార్యదర్శిగా మల్లేశ్వరీలతో పాటు మరో 7 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు..

## నేషనల్ ఫార్మసీ వీక్-2022లో భాగంగా ర్యాలీ

**కర్నూలు విద్య, నవంబరు 21, ప్రభాతవార్త:** నగరంలోని మదర్థెరిస్సా ఫార్మసీ కళాశాల యందు నేషనల్ ఫార్మసీ 2022లో భాగంగా కళాశాల నుంచి కలెక్టరేట్ మీదుగా గాయత్రీ ఎస్టేట్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ డా.అదిమూలపు సతీష్, అకాడమిక్ డైరెక్టర్ డా.స్టెల్లా సతీష్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.అదిమూలపు సతీష్ మాట్లాడుతూ ఫార్మసీ యొక్క గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.కె సురేష్, అకడమిక్ డీన్ ఎం రాజ్కుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిని శైవక్షేత్రాలు



**బేతంచెర్ల, నవంబర్21, ప్రభాతవార్త:** మండలంలోని శైవక్షేత్రాలు కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో భక్తులతో కిటకిటలాడాయి. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీ ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఎంబాయి గ్రామ సమీపంలోని భోగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బేతంచెర్లలోని సిద్దేశ్వరస్వామి ఆలయం నందు రహిమాన్‌పురంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో దర్శనార్థం వచ్చిన భక్తులకు హెచ్‌కొట్టాల రైతు సంఘం ఆధ్వర్యంలో నారాయణసేవ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో శ్రీరాములు, మహేష్, పలువురు హెచ్‌కొట్టాల ప్రముఖులు, ఆయా ఆలయాల అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## నంద్యాల్లో రెండు ఇళ్లు దొంగతనం

**నందా ్యల క్రైం, నవంబరు 21, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా కేంద్రంలో ఎంఎస్‌నగర్‌లోని రెండు ఇళ్ళల్లో గుర్తుతెలియని దొంగలు జోరబడి రూ.2.70 లక్షల నగదును దోచుకుపో యారు. ఈశ్వరయ్య అనే గృహ యజమాన్ని కుటుంబ సభ్యులతో కలిసి అన్నవరం వెళ్లాడు ఈక్రమంలో బాష అనే బాధితుడి ఇంటిపైన పడుకొని ఉండగా ఇంటిద్వారబందరంకు వేసిన తపులు పగలగొట్టి దోపిడికి పాల్పడ్డారు. అన్నవరం పోయి తిరిగి వచ్చిన ఈశ్వరయ్య ఇంటిపరిస్థితిని చూశారు. ఇంటితాళాలు పగలగొట్టడం, బీరువాను చిందరవం దరపై అనుమానం వచ్చి త్రీటౌన్‌లో ఫిర్యాదుచేశారు. సిఐ నరసింహులు, సిబ్బంది బాధితుల ఇంటికి చేరుకొని ఘటనపై పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు. తన ఇలాకాలో ఇంటిని వదలి వేరే ఊర్లకు వెళ్లే సమయంలో సంబంధిత త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయాలి. ఆ ఇంటిపై ప్రత్యే ్యక నిఘా పెడతామని సిఐ తెలిపారు. అదమరిచి పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వకుండా వెళ్లడం వల్ల దొంగలు తమపని తాముచేసుకుంటే వెళ్తున్నారని తెలిపారు. ఏదైనా అనుమానం వస్తే సంబంధిత సిఐ 9121101088కు సమాచారం ఇవ్వాలని సిఐ కోరారు.

## పి.కోటకొండలో డెంగ్యూ కేసు నమోదు



గ్రామాన్ని సందర్శిస్తున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి

**దేవనకొండ, నవంబరు 21, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పి.కోటకొండ గ్రామంలో దస్తగిరి అనే ఏడేళ్ల బాలుడికి డెంగ్యూ నిర్ధారణ అయినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. సోమవారం గ్రామాన్ని సందర్శించి దోమల నియంత్రణ కొరకు గ్రామంలో దోమల మందును పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు పంచాయితీ సెక్రటరీ సుంకన్న పాల్గొన్నారు.

## వీరజవాన్లకు త్యాగనీరతిని కొనియాడుదాం : జిల్లా కలెక్టరు



**నంద్యాల విద్య , నవంబరు 21, ప్రభాతవార్త:** త్రీసాయిధ దళాల పతాక దినోత్సవం డిసె ంబరు 7న ఘనంగా నిర్వహిస్తున్నారని అందుకు ప్రతిసంవత్సరం లాగే ఈఏడాది కూడ జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ చేతుల మీదుగా అర్మీ స్టిక్కర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్యంలో మాతృభూమికై విశిష్ట సేవలు అందిస్తు తమ జీవితాలను త్యాగం చేసిన వీరజవాన్లను త్రీసాయిద దళాలు దేశ సరిహద్దులను కాపాడడంలో నిరంతరం సేవలు అందిస్తున్న సైనికులు వారి కుటుంబ సభ్యుల, మాజీ సైనికుల త్యాగనిరతిని కొనియాడారు. ప్రతిపౌరుడు జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఈదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు దినోత్సవ నిధికి విరివిగా విరాళాలు ఇచ్చి బారత సైన్యంలోని మాతృభూమికై విశిష్ట సేవలు అందిస్తున్న వీరజవాన్ల త్యాగనిరతిని స్మరించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మహే ద్రమ్మ, పర్యవేక్షకులు పాల్గన్నారు.

## కార్తీకశోభను సంతరించుకున్న గంగమ్మబావి

**డోన్, నవంబరు 21, ప్రభాతవార్త :** పట్టణ సమీపంలోని గంగమ్మబావి ప్రాంతం కార్తీకమాసం చివరి సోమవారం కాదడంతో పూర్తిగా కార్తీక శోభను సందరించుకుంది. అక్కడ ప్రతిష్టితించిన ఆంజనేయస్వామి దేవాలయంతోపాటు ఉసిరిక చెట్టుకు పూజలు నిర్వహించేందుకు భక్తాదులైన జనం పోటెత్తారు. ఆయల కమిటీ శాశ్విత ధర్మకర్త కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో భక్తజనానికి సకల సౌకర్యాలను కల్పించి వనభోజన కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. మొదట గంగాధర లింగేశ్వరస్వామికి పంచామతాభిషేకం మంత్రోచ్ఛరణలమధ్య నిర్వహించారు. అనంతరం ఉసిరిక చెట్టుకు పూజలు చేసిన అనంతరం శివ, అయ్యప్ప మాలలు ధరించినవారితోపాటు హాజరైన భక్తులకు కార్తీక వనభోజనాలను కిరణ్ యాదవ్ నేతృత్వంలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిస్టమ్మ, సుదీష్‌రాజ్, తాడూరు రంగనాథ్, ఎల్లగౌడ్, సంజీవ, మహేష్‌యాదవ్, విష్ణువర్దన్‌రెడ్డి, లాలుమానిపల్లి గోవిందు, యుగంధర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



## డోన్‌లో ప్రారంభమైన జగనన్న క్రీడాసంబరాలు

ప్రారంభించిన మున్సిపల్ ఛైర్మన్, ఎంపిపిలు

జిల్లాస్థాయి పోటీలకు కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ జట్లు



పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపిపి రాజశేఖర్

**డోన్, నవంబరు 21, ప్రభాతవార్త :** క్రీడలపట్ల ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు కూడా ప్రోత్సాహాన్ని అందించాలని మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకోసం ప్రత్యేకంగా ఒక పిరియడ్ ఉండటంతోపాటు పిఇటిలు, ఆటస్థలం ఉంటుందని అయితే ప్రయివేటు స్కూల్స్‌లో కొన్నింటిలో అసలు పిఇటిలే ఉండరని ఇది విద్యార్థులకు క్రీడలు పూర్తిగా కనుమరుగుచేసే ప్రమాదముందని వారన్నారు. క్రీడలకు పూర్వ వైభవాన్ని తీసుకవచ్చేందుకు వైకాపా ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లను ఏర్పాటుచేసిందని చెప్పారు. వీటిద్వారా ఎంతో నైపుణ్యం, ప్రతిభవుండి ఆటలను ప్రదర్శించలేనివారికి మండలస్థాయిలో, జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో రాణించేందుకు ప్రతిఏటా ఎంపికా పోటీలను నిర్వహించే కార్యక్రమమే జగనన్న క్రీడా సంబరాలని వారన్నారు. పట్టణంలోని శ్రీసుధా ఉన్నత పాఠశాల (ఓల్డ్ ఎస్‌కెపిహెచ్ఎస్) ప్లే గ్రౌండ్‌లో ఎంపిడిఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో క్రీడాసంబరాల కార్యక్రమం సోమవారం ముమ్మరంగా జరిగింది. ప్రారంభోత్సవ ఉపన్యాసాలను ఛైర్మన్ రాజేష్‌తోపాటు ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాసులు, ఎంఇఓ ప్రభాకర్, శ్రీసుదా స్కూల్ కరస్పాండెంట్ వేణుగోపాల్, ఎస్‌కెపి కమిటీ ఛైర్మన్ బచ్చు జయశీలగుప్తా, మున్సిపల్ కౌన్సిలర్‌లు సాదిక్‌అహ్మద్, మిట్టా ఉమామహేశ్వరి తదితరులు ప్రసంగించారు. అనంతరం వాలీబాల్, క్రికెట్, కబడ్డీ ఆటలకు సంబంధించిన జట్టు ఎంపిక పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో క్రీడాకారుల్లో ప్రతిభ ఉన్నప్పటికి సరైన ప్రోత్సాహం లేక ఉండిపోతున్నారని వారంతా క్రికెట్ క్లబ్‌లద్వారా ప్రతిభను బయట పెటేట ందుకు అవకాశం వస్తుందని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు క్లబ్‌లో నమోదుచేసుకుని పోటీలకు ఎంపికై రాష్ట్రస్థాయిలో రాణించవచ్చన్నారు. ప్రతి ఒక్కరు ఈ క్లబ్‌లగురించి తెలుసుకుని ప్రోత్సహించాలన్నారు. అదేవిదంగా ప్రయివేటు స్కూల్ యాజమాన్యాలుకూడా పిల్లలకు క్రీడల పట్ల శ్రద్ధ వహించేలా చేయాలన్నారు. కమిటీ అద్యక్షులు జయశీల మాట్లాడుతూ క్రీడలు, చదువు నాణేనికి రెండువైపులా ఉన్నటువంటివియని దేన్నికూడా అశ్రద్ధ చేయకూడదన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ బాద్యులు లక్ష్మీనారాయణ, పిఇటిలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, వైకాపా యూత్ లీడర్ కమలాపురం మదు తదితరులు పాల్గొన్నారు.

**కబడ్డీ జట్టుకు స్పాన్సరర్‌గా కౌన్సిలర్ సాదిక్:** డోన్‌లో జరిగే జగనన్న క్రీడా సంబరాల్లో బాగంగా మంచి ఆటను ప్రదర్శించి జిల్లా స్థాయికి ఎంపికయ్యే క్రికెట్‌జట్టుకు స్పాన్సరర్‌గా మున్సిపల్ కౌన్సిలర్ సాదిక్‌అహ్మద్ వ్యవహరించనున్నట్లు కార్యక్రమంలో ప్రకటించారు. సుమారు రూ.20వేలు వ్యయం అయ్యే మొత్తం జట్టు సభ్యులకు అవసరమైన క్రీడాదుస్తులు, బూట్లు తదితర అన్నింటిని సమకూర్చేందుకు సాదిక్ ముందుకు రావడంపట్ల ఛైర్మన్ రాజేష్, ఎంపిపి రాజశేఖర్‌లతోపాటు నిర్వాహకులు హర్షం వ్యక్తంచేసారు. ప్రతిఒక్కరు క్రీడలకోసం ఏదోరకంగా ప్రోత్సాహాన్ని అందిస్తే ఎంతోమంది క్రీడలకు ఆకర్షితులు అవుతారని వారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి : ఎమ్మెల్యే ఆర్థర్

గడప గడప కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం



సంక్షేమ పథకాలను అవ్వకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

**జూపాడుబంగ్లా ,నవంబర్ 21 ప్రభాతవార్త :** ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలు పనిచేస్తున్న జగనన్న ప్రభు త్వాన్ని ప్రజలు నిండు మనస్సుతో మరోసారి ఆశీర్వదించాలని నందికొట్కూరు నియోజక వర్గం ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ పిలుపు నిచ్చారు. జూపాడుబంగ్లా మండలంలోని తూడిచెర్ల గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఏ కుటుబానికి ఎంతెంత లబ్ది చేరుకుడం జరిగిందో వివరించారు. దేవుడి దయవల్ల మీ అందరీ చల్లని దీవెనలతో మూడేళ్లపాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందివ్వడం జరిగిందన్నారు. నవరత్నాల పేరుతో ప్రతి కుటుంబానికి లబ్దిచేకూరే విధంగా సంక్షేమ పథకాలను తీసుకుని రావడం జరిగిందన్నారు. అవ్వాతాతలకు నెలనెల పింఛన్ అందించడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా పెన్షన్ మళ్లీ పెంచి ఇవ్వడం జరుగుతుందన్నారు. మీ అందరి చల్లని దీవెనలతో జగనన్నను ఆదరించి, ఆశీర్వదించాలని ఆయన కోరారు.. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన భాద్యత అధికారులపై ఉందన్నారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా సిఎం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో పలుకుబడి ఉంటేనే సంక్షేమ పథకాలు అందేవన్నారు. ప్రస్తుతం సమస్య తెలిపితే వలంటీర్ల ద్వారా వెంటనే పరిష్కారమవుతున్నాయన్నారు. నిజాయితీ, మాటకు ప్రాణమిచ్చే గుణం, నిబద్ధత, ప్రజలకు మేలు చేయాలనే తపన సిఎంలో వున్నాయన్నారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లుతూ ప్రజలతో మమేకమై వారిని అక్క బాగున్నావా..అన్నా బాగున్నావా..అవ్వతాత..మీకు పెన్షన్ అందుతుందా..అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. వారి సమస్యలు తెలుసుకుంటూ , ఆ సమస్యలను అక్కడిక్కడే అధికారుల ద ృష్టికి తీసుకెళ్లి వారికి అక్కడిక్కడే ఆదేశాలు జారీచేయడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వెలువెత్తాయి. కొంత మంది అవ్వాతాతలు జగన్ ప్రభుత్వంపై దీవెనలు కురించారు. ఈ కార్యక్రమంలో తహశీల్థార్ పుల్లయ్య యాదవ్, ఇన్‌చార్జ్ ఎంపిడిఓ మణిమంజరి, సర్పంచ్ బాలమద్దిలేటి, ఏఓ క ృష్ణారెడ్డి, ఏఈలు బషీర్, నాగేంద్ర, శ్రీనాథ్, ఎపిఎం అంబమ్మ, ఎపిఓ గౌరీబాయి, వైకాపా నాయకులు పద్మనాభయ్య, సత్యనారాయణశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా సంక్షేమపథకాలను అందిస్తున్న ఘనత జగనన్నదే- ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి



సంక్షేమపథకాల కరపత్రాలను అందిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవితో శివారెడ్డి, సర్పంచ్ బోయరాములమ్మ, జడ్పీటిసి సుంకన్న

**వెల్దుర్తి, నవంబర్21, ప్రభాతవార్త :** గత ప్రభుత్వంలో లాగా జన్మభూమి కమిటీల ద్వార కాకుండా పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి(జగనన్న)కే దక్కుతుందని పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి అన్నారు. మండలంలోని చెరుకులపాడు గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శ్రీదేవి, క్రిష్ణగిరి ఎంపిపి కంగాటి వెంకటరామిరెడ్డి, వైకాపా నాయకులు కంగాటి శివారెడ్డి, సర్పంచ్ బోయరాములమ్మ, జడ్పీటిసి దాదిపోగు సుంకన్న, వైకాపా నాయకులతో కలిసి గడపగడపకు తిరుగుతూ ప్రజాసంక్షేమపథకాలను వారికి వివరించారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి గల తేడాను గమనించాలన్నారు. గ్రామసచివాలయం, వాలంటరీ వ్యవస్థ ద్వార ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయన్నారు. విద్య, వైద్యంకు కోట్లాదిరుపాయలు ఖర్చు చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరువరాదన్నారు. కరోనా కష్టకాలంలో సైతం సంక్షేమపథకాల క్యాలెండర్‌లో ప్రకటించినట్లుగానే సంక్షేమపథకాలు ఆపకుండా వైకాపా ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తెదేపా నాయకులు వచ్చి వెళ్తుంటారని వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణగిరి ఎంపిపి కంగాటి వెంకటరామిరెడ్డి, కంగాటి శివారెడ్డి, సర్పంచ్ బోయరాములమ్మ, జడ్పీటిసి సుంకన్న, ఎంపిడిఓ శ్రీనివాసరావు, డిటి ప్రవీణ్‌కుమార్, ఇఓఆర్డీ నరసింహులు, ఏఓ అక్బర్‌బాష, వీఆర్వో బివి. రమణారెడ్డి, ఇతర శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు , వైకాపా నాయకులు శివ, మోహన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే డా.సుధాకర్

– గత ఎమ్మెల్యేల కోసం బార్లు , క్లబ్‌లు వెతుకోవాల్సి ఉండేది

**కోడుమూరు , నవంబర్ 21 ( ప్రభాతవార్త ) :** నిరంతరం ప్రజల ముంగిట కోడుమూరు ఎమ్మెల్యే డా.సుధాకర్ ఉంటున్నారని కోడుమూరు వైసీపీ నాయకులు విజయ యాదవ్, లాయర్ ప్రభాకర్, ఇమ్మానియల్ అన్నారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ఇక్కడ పనిచేసిన ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండే వారు కారన్నారు. వారి కోసం వెళ్లే ప్రజలు బార్లు,క్లబ్‌లు వెతుకోవాల్సి ఉండేదన్నారు. కానీ అలాంటి పరిస్థితులు నేడు లేవని, ఏ క్షణం అయిన ప్రజా సమస్యలను పట్టించుకునేందుకు ఇంటి దగ్గరే ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారని చెప్పారు. కేవలం రాజకీయాలలో దూసుకుపోతున్న ఎమ్మెల్యే సుధాకర్‌ను, వైసీపీ పాలన చూసి ఓర్వలేక కోడుమూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జు ఆకేపోగు ప్రభాకర్ అసత్యపు ఆరోపణలు చేయడం తగదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు పరుస్తున్న పథకాలు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పొందడం లేదా అని ప్రశ్నించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై ఎమ్మెల్యే సుధాకర్ ప్రతి గ్రామాన్ని తిరుగుతూ నిరంతరం ప్రజల సమస్యలను అధ్యయనం చేసుకొని వాటి పరిషరిస్తూన్నారన్నారు. కోడుమూరు నియోజకవర్గంలో ఎప్పుడూ లేనంతంగా జరగని అభివృద్ధి జరిగిందన్నారు. ఇసుక దోపిడి తెలుగుదేశం పార్టీ హయంలోనే జరిగిందని ఆరోపించారు. ప్రజల అవసరాల కోసం ఇసుక వినియోగిస్తుంటే దీనిపై రాజకీయం చేస్తున్నారన్నారు. గత టీడీపీ హయంలో ప్రభాకర్‌కు రాష్ట్ర ఎస్సీ సంక్షేమ బోర్డు ఛైర్మన్‌గా ఉండి ఎంత మంతి దళితలను అభివృద్ధి చేశావని ప్రశ్నించారు. ప్రతి ఎన్నికలల్లో ప్యాకేజి తీసుకుంటూ రాజకీయాలు చేస్తూ సంపాదించుకోవడమే రాజకీయ జీవితం కొనసాగిస్తున్నావన్నారు. అందుకే తెలుగుదేశం పార్టీ టిక్కెట్ పొందలేక పోతున్నారని వెల్లడించారు. ఈ సమావేశంలో స్థానిక వైసీపీ నాయకులు బలరామ్, అద్దుగుల ప్రతాప్‌రెడ్డి, జయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

## చిన్నమరీవీడులో అంగన్వాడి కేంద్రం ప్రారంభం



అంగన్వాడి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

**గోనెగండ్ల నవంబరు 21 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామంలో సోమవారం నియోజకవర్గ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నూతన అంగన్వాడి భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ సావిత్రి దేవి మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తల పనితీరును, ప్రభుత్వం ద్వారా వస్తున్న పథకాల గురించి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాలను సక్రమంగా అందించాలని వారు తెలిపారు. అంగన్వాడి వర్కర్లపై ప్రజలలో పౌష్టికాహారాలు పక్కదారి పడుతున్నట్లు అపోహలు ఉన్నాయిని వాటిని తొలగించుకోవాలంటే కార్యకర్తలు నిజాయితీగా పని చేస్తూ అంగన్వాడి ఉదయం 9 గంటలకు నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పిల్లలతో పాటు సిబ్బంది కూడా అంగన్వాడిలో ఉండాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గర్భవతులకు, బాలింతలకు పిల్లలకు పౌష్టికాహార లోపం లేకు ండా అంగన్వాడి కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. చిన్నమరివీడి గ్రామంలో ఎస్సీ కాలనీలో రూ.12లక్షలతో నిర్మించబడిన భవనాన్ని ప్రారంభించారని అన్నారు. అనంతరం గ్రామంలో సమస్యలపై గ్రామస్తులతో మాట్లాడుతూ జగనన్న గడప గడప కార్యక్రమంను ప్రతి గ్రామంలో నిర్వహిస్తూ గ్రామానికి గ్రామ అభివృద్ధి కోసం సచివాలయాలకు రూ.20లక్షలతో అవసరమైన చోట సీసీరోడ్డు, డ్రైనేజీలు, త్రాగునీటి వసతి కుళాయిలు ఏర్పాటు చేయాలని అదికారులకు ఆదేశించారు. చిన్నమరివీడులో హైస్కూల్ నందు 12వ తరగతి గదుల నిర్మాణానికి రెండు కోట్లతో నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, అంగన్వాడి సూపర్‌వైజర్ విజయలక్ష్మి, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, మండల యూత్ నాయకులు బందేనవాజ్, మండల కన్వీనర్ దొరబాబు, చిన్నమరివీడు వైకాపా నాయకులు మహేంద్రరెడ్డి, ఎంపీటీసీ బసప్ప, కిష్టఫర్, రాజశేఖర్, లక్ష్మన్న, కేసన్న, వాసు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత వితరణ చేసిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



**బనగానపల్లె, నవంబర్21, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని యాగంటి క్షేత్రంలో కార్తీకమాస చివరి సోమవారం సందర్భంగా శ్రీ ఉమామహేశ్వరస్వామి నిత్యాన్నదాన సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మలు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు యాగంటి క్షేత్రానికి చేరుకోగానే ఆలయ ఈవో బి.చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి ఛైర్మన్ తోట బుచ్చిరెడ్డి మరియు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ ఉమామహేశ్వరస్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తదనంతరం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు స్వామిఅమ్మవార్ల దర్శనార్థం వచ్చిన భక్తులకు స్వయంగా అన్నదాన వితరణ గావించారు. ఉమామహేశ్వరస్వామి నిత్యాన్నదాన సంస్థ నిర్వా హకులు దస్తగిరిరెడ్డి, దొనపాటి యాగంటిరెడ్డి, రామారెడ్డి, ఆలయ సిబ్బంది ఆర్కి యాలజిస్ట్ శ్రీనివాసులు, ఆలయ అర్చకులు మహేష్ శర్మ, దేవుడు, లోకనాథ్ పాల్గొన్నారు.

**శ్రీ ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థకు భక్తుల విరాళాలు :**

శ్రీ ఉమామహేశ్వరస్వామి నిత్యాన్నదాన సంస్థకు యాదాద్రి భువనగిరి జిల్లా నారాయపురం మండలానికి చెందిన డి.నాగేష్ రూ.1,00,000లు, హైదరాబాద్‌కు చెందిన సిద్దార్థ ఠాగూర్ రూ.15వేలు, అవుకు మండలం శింగనపల్లెకు చెందిన రామకృష్ణారెడ్డి రూ.10,116లు, కర్నూలు కార్పొరేటర్ విక్రమ సింహారెడ్డి రూ.25,116లు విరాళంగా అందించారు. ఈ మేరకు నిత్యాన్నదాన సంస్థ నిర్వాహకులు విరాళాలు అందించిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వనభోజన మహోత్సవ కార్యక్రమానికి హజరైన ఎమ్మెల్యే



గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

**ఎమ్మిగనూరు నవంబర్ 21 ప్రభాతవార్త:** పట్టణంలోని ఉసిరికాయ చెట్టు నందు ఉప్పర కార్తీక మాస వనభోజన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి హాజరైయ్యారు. వైసిపి పట్టణ ప్రదాన కార్యదర్శి యూకె.వీరేంద్ర అధ్వర్యంలో ఎమ్మెల్యేకు గజమాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో కర్నూలు జిల్లా ఉప్పర సంఘం అధ్యక్షుడు రాముడు, ఏపి ఈరన్న, మునిసిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ ఆహ్మద్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ యూకె.రాజశేఖర్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ, కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన జగన్‌రెడ్డి



తెలుగు యువత అధ్వర్యంలో నిరసన తెలుపుతున్న దృశ్యం

**కర్నూలు న్యూసిటి, నవంబరు 21, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనలో యువతకు ఉద్యోగాలు లేవు, కార్పొరేషన్లతో స్వయం ఉపాధి లేదని కర్నూలు పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షులు విమర్శించారు. మూడున్నర సంవత ్సరాల్లో కార్పొరేషన్ల ద్వారా ఒక్కరికైనా రుణం ఇచ్చారా? యువతకు ఉపాధి, ఉద్యోగాలు లేక కొంత మంది పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్తుంటే మరికొంత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు నిధులు, విధులు లేకుండా జగన్‌రెడ్డి వాటిని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. టిడిపి హయాంలో చంద్రబాబునాయుడు కార్పొరేషన్ల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, కాపు నిరుద్యోగ యువతకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి స్వయం ఉపాధి కల్పించారన్నారు. కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇవ్వడం కాదు కనీసం కార్పొరేషన్ల చైర్మన్లకు, డైరెక్టర్లకు కనీసం జీతాలు కూడ ఇవ్వలేని స్థితిలో జగన్ ప్రభుత్వం ఉందన్నారు. 25 మంది ఎంపీలనిస్తే కే ంద్రం మెడలు వంచి హోదా తెస్తానని ప్రగల్బాలు పలికిన జగన్ ఇప్పుడు 36 మంది ఎంపీలుండి ఏమిసాధించారో వివరించాలన్నారు. ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీచేయాలనా న్నరు.

## సోమవారం స్పందనలో వచ్చిన అర్జీలకు శనివారంలోపు పరిష్కారం చూపాలి..



అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

**ఆదోని రూరల్, నవంబరు 21, ప్రభాతవార్త :** సోమవారం స్పందనలో వచ్చిన అర్జీలకు శనివారం లోపు పరిష్కారం చూపాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ డివిజన్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన అర్జీలను సంతృప్తి చెందేవిధంగా పరిష్కరించాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలు ఏ ఒక్కటీ తిరస్కరించకుండ సానుకూల దృక్పథంతో సత్వరమే పరిష్కరించాలని ఎట్టి పరిస్థితుల్లో బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండ గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం స్పందనలో వచ్చిన అర్జీలు ఎన్ని పరిష్కరించారు..ఇంకా ఎన్ని పరిష్కరించాలి..వంటి వివరాలను శనివారం సాయంత్రంలోపు నివేదిక ఉన్నతాధికారులకు పంపాలన్నారు. అనంతరం లబ్దిదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## విద్యతోను సమాజాభివృద్ధి లక్ష్యం



నాడు నేడు పనులకు భూమి పూజ చేస్తు న్న ఎర్రకోట

**నందవరం, నవంబరు 21, ప్రభాతవార్త:** సమాజాభివృద్ధి కోసం నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైసీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో ఎంపీపీ స్కూల్‌లో మనబడి నాడు నేడు పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలని ముఖ్యమంత్రి కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు తమవంతు కృషితో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని పేర్కొన్నారు. నాడు నేడు ద్వారా పాఠశాల మరమ్మత్తులకు రూ.27 లక్షలు మంజూరు చేశామని, రూ.25 లక్షలతో గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించాలని, పనులను వేగవంతంగా పూర్తిచేయాలని పేరెంట్స్ మానిటరింగ్ సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, వైసీపీ ప్రధాన కార్యదర్శి పేట శ్రీనివాసురెడ్డి, ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, గ్రామ సర్పంచ్ పల్డొడ్డి కిష్టప్ప, ఎంపిటిసి, మండల వైస్ ఎంపీపీ అగ్నేశమ్మ, ఉప సర్పంచ్ సప్పాగు కోటప్ప, అగోలి పెద్ద తిమ్మయ్య, అగోలి గాలెన్న, పల్డొడ్డి కోటేశ్వరరావు, జయరాజు, శివ, వరదరాజు, ప్రభాకర్, పంచాయితీ సెక్రెటరీ జయరామ్, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 21 మంది మత్స్యకారులకు టూవీలర్స్, ఐస్‌బాక్సులు మంజూరు : జిల్లా కలెక్టరు



మత్స్యకారులకు మంజూరు పత్రాలు అందిస్తున్న జిల్లా కలెక్టరు

**నంద్యాల, నవంబరు 21, ప్రభాతవార్త:** అంతర్జాతీయ మత్స్యకారుల దినోత ్సవం సందర ్భంగా స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశ్యంతో 21 మందికి టూవీలర్స్, ఐస్‌బాక్సులను పంపిణి చేస్తున ్నట్లు జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని విడియోకాన్ఫరెన్స్ హాల్‌లో రాష్ట్రముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థానను ప్రత్యక్షంగా చూశారు. రాష్ట్రస్థాయిలో 23 వేల మంది మత్స్యకారులకు రెండవ విడత అర్థికసాయంగా రూ.108 కోట్ల రూపాయలు బటన్‌నొక్కి నేరుగా లబ్దిదారులకు అందజేసిన వైనాన్ని వీక్షించారు. నంద్యాల పార్లమెంటు సభ్యులు పోచాబ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాష, బెస్తసంఘం డైరెక్టరు చంద్రశేఖర్, జిల్లా మత్స్య సంఘ ప్రెసిడెంట్ వెంకటసా ్వమి, మత్స్యశాఖ జెడి రాఘవరెడ్డి ఈకార్యక్రమాన్ని వీక్షిచాంచారు. ఈసందర్భంగా జిల్లాలో 21 మందికి ఈ అర్థికసాయాన్ని అందజేశారు.

## వార్త ప్రభావం..

## రెగ్యులర్ తహశీల్దార్ నియామకం

**హొళగుంద, నవంబరు 21, ప్రభాతవార్త :** హొళగుందకు రెగ్యులర్ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శేషఫణి బదిలీపై గత కొన్ని నెలల క్రితం కోడుమూరుకు వెళ్లారు. ఆయన స్థానంలో హొళగుందలో ఇంచార్జ్ తహశీల్దార్‌ను నియమించారు. అయితే ఇంచార్జ్ తహశీల్దార్ పాలనలో తహ శీల్దార్ కార్యాలయం అస ్తవ్యస్తంగా తయారైందని పైసలిస్తేనే..పని.. కంప్యూ టర్ ఆపరేట రా..మజాకా..అనే శీర్షికలు వార్త దినపత్రికలో ప్రచురితం కావడంతో జిల్లా రెవెన్యూ అధికారులు హొళగుంద తహశీల్దార్ కార్యాలయానికి రె